క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి తెలిపారు. ఎంపీపీ నిధులతో గ్రామంలో కొత్తగా నిర్మించిన తాగునీటి బోరును ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇక్కడి తాగునీటి సమస్యను గ్రామస్తులు తెలియజేశారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని, మండల పరిషత్ నిధులు మంజూరు చేసి, బోరు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు



వాసవీనగర్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ కుమార్

రాజాం సిటీ: స్థానిక పట్టణంలోని పలు వీధులకు లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని విద్యుత్‌శాఖ ఏఈ ఓజేసీఏ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వీధుల్లో 160 కేవీ(కిలోవాట్లు) ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గతంలో 100 కిలోవాట్లు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో కాలెపు, కాకర్ల, కుమ్మరి వీధులతో పాటు, వాసవీనగర్ తదితర ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య తరచుగా తలెత్తేదన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పడిన విద్యుత్ సమస్య మళ్లీ రాకుండా ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చుతున్నామన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన



తునివాడలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్యామలాకుమారి

రేగిడి: మండలంలోని వెంకమపేట, తునివాడ, పాతచెలికానివలస తదితర గ్రామాల్లో ఎంపీడీవో డి.శ్యామలాకుమారి మంగళవారం పర్యటించి, పారిశుద్ధ్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అవగాహన కల్పించారు. తాగునీటి బోర్లు, నేలబావులు, రక్షిత పథకం కుళాయి పైపుల వద్ద మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ హేమసుందరవవు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం



సంతకవిటి: మొక్కలు నాటుతున్న విద్యార్థులు, సిబ్బంది

సంతకవిటి: స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్(జాతీయ సేవా పథకం) దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.జనార్దనరావు, ఎన్.ఎస్.ఎస్ నిర్వహణాధికారి ఎం.షణ్ముఖరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మెరుగైన సమాజానికి విద్యార్థి దశ నుంచే వివిధ సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, పరిరక్షించాలన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని రాజాం సత్యసాయి జోనల్ కన్వీనర్ వి.వి. సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడిన ఆయన చదువుతో పాటు క్రీడలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ పాల్గొనాలని సూచించారు. దైవనామస్మరణ చాలా గొప్పదని, తమ ఇష్ట దైవాన్ని ప్రతిరోజూ ప్రార్థించుకోవాలన్నారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, హెచ్‌ఎం వావిలపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం



రేగిడి: వన్నలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు అందజేస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా జరుగుతోంది. మంగళవారం వలంటీర్లు, వైద్యారోగ్య సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి, ఆరోగ్య సమస్యలపై ఆరాతీశారు. అనారోగ్యంతో బాధపడే వారి వివరాలు సేకరించారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి, ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రతీ గ్రామంలో జరిగే వైద్య శిబిరాల్లో రోగులకు అవసరమైన చికిత్స, మందులు అందజేస్తామన్నారు. ప్రజారోగ్యానికి భరోసానిచ్చే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: తెర్లాం పట్టణంలో మహిళ బీపీ తనిఖీ చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి



రామభద్రపురం: రామభద్రపురంలోని చొక్కాపు వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



సంతకవిటి: బొద్దూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న మండల పరిపాలనాధికారి రఘునాథాచారి



రాజాం: పెనుబాక గ్రామంలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది



రాజాం సిటీ: పొగిరిలో విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు

విద్యార్థులను దత్తత తీసుకోవాలి



వంట నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

• కలెక్టర్ నాగలక్ష్మి

మెంటాడ: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని, ప్రతీ ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకుని, బాగా చదివించాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని జి.టి.పేట జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆమె ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పాఠశాల రికార్డులు, మనబడి నాడు–నేడు అభివృద్ధి పనులను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, పరిశీలించిన ఆమె ఆహార పదార్థాలు రుచి, శుచితో ఉండాలని, వేడివేడిగా ఉన్నప్పుడే విద్యార్థులకు వంటకాలు వడ్డించాలన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని, పరీక్షలు జరిగేంత వరకు ప్రతీ విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రతీ పాఠశాలను వారంలో ఒకరోజు తప్పనిసరిగా పర్యవేక్షించాలని ఎంఈవోలకు తెలిపారు. విద్యార్థులు కూడా బాగా చదువుకుని, క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివాజీ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక మారుతీ కాలనీలోని వినాయక మండపంలోని విఘ్నేశ్వరుడిని మంగళవారం ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలే తన బలమని విశ్వసిస్తూ నిత్యం వారి శ్రేయస్సు కోసం ఆలోచించే ముఖ్యమంత్రి జగనన్న ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని వేడుకున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి జరిగిందని, అందరూ 2024 ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. స్కిల్ స్కామ్‌తో ఎవరు అవినీతి పరులో, ఏ పార్టీ అవినీతి పార్టీయో ప్రజలకు బాగా తెలిసిపోయిందని టీడీపీని ఉద్దేశించి అన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, ప్రజాధనాన్ని ఆ పార్టీ నేతలు కొల్లగొట్టారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డగోలుగా రూ.కోట్లు దోచేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో జగనన్న సర్కారు మళ్లీ అధికారం చేపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీవామృతం పిచికారీతో బహుళ ప్రయోజనాలు



భీమవరంలో వరి పొలంలో ద్రవజీవామృతం పిచికారీ చేస్తున్న రైతు



రాజాం: పొగిరిలో అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పంటలపై పిచికారీ చేసే ద్రవజీవామృతంతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ ఈశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని చినభీమవరం గ్రామంలో ద్రవజీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం దానిని రైతులు గొట్టాపు కృష్ణమూర్తి, శారదమ్మ వరి పొలాల్లో పిచికారీ చేశారు. ఈ జీవామృతంతో నేల సారవంతం కావడంతో పాటు మొక్కలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. మంచి దిగుబడులు కూడా వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సేంద్రియ ఎరువులు వాడడం వల్ల ఆరోగ్యవంతమైన పంటలు చేతికి వస్తాయన్నారు. అలాగే తక్కువ పెట్టుబడి ఖర్చుతో అధికంగా పంట దిగుబడులు వస్తాయన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన..

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం పొగిరి యూనిట్ ఇన్‌చార్జ్ పి.రమాదేవి తొలుత ఘన, ద్రవజీవామృతాలు, అగ్నిఅస్త్రం, కషాయాల తయారీని వివరించారు. అనంతరం పలువురు రైతులతో 50 లీటర్ల మేర అగ్నిఅస్త్రంను వరి పొలాల్లో పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ నిర్మల, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు తదితరులుపాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సర్పంచ్ మన్మథరావు తదితరులు

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కందిశ గ్రామ సర్పంచ్ కెల్ల మన్మథరావు అన్నారు. మండలంలోని కందిశ గ్రామంలో సాగునీటి చెరువులు, కాలువలు, ప్రధాన రహదారులు పక్కన, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. రెడ్డీస్ ఫౌండేషన్ పంపిణీ చేసిన మామిడి, జామ, సపోటా, జీడి, నిమ్మ, చింత తదితర జాతులకు చెందిన దాదాపు వెయ్యి మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామ యువత వీటి సంరక్షణకు ముందుకు రావాలని, ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఓ మొక్క రక్షణ చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పరశురాం, రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



తెర్లాం: మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి

తెర్లాం: జగనన్న కాలనీ లేఅవుట్లు, సొంతస్థలాల్లో లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు, గ్రామ వలంటీర్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని చేపట్టనుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని, లబ్ధిదారులంతా నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. బిల్లుల చెల్లింపుల్లో ఎటువంటి జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పూర్తయిన ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలు చేయించాలని, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించి, ఎటువంటి సమస్యలున్నా సంబంధిత శాఖల అధికారుల దృష్టికి గానీ, తన దృష్టికి గానీ తీసుకురావాలన్నారు. సమావేశంలో మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆనందకుమార్, ఎంపీడీవో కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా మరుగుదొడ్లు ఉండాలి..

రామభద్రపురం: జగనన్న కాలనీలు, సొంతస్థలాల్లో లబ్ధిదారులు నిర్మించుకునే ఇళ్లల్లో కచ్చితంగా మరుగుదొడ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమామణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించిన ఆమె తొలుత మండలంలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.. పూర్తి కావాల్సిన నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి.. ప్రారంభం కావాల్సిన నిర్మాణాలు ఎన్ని అని ఆరాతీశారు. ఇప్పటి వరకు పూర్తయిన ప్రతీ ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా చూడాలన్నారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 వేలు మంజూరు చేస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి, నిర్మాణాలకు వారు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఏఈఈ సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

అక్టోబర్ 1 నుంచి గోధుమపిండి పంపిణీ

బొబ్బిలి: రేషన్‌కార్డుదారులకు అక్టోబర్ 1వ తేదీ నుంచి బియ్యంతో పాటు గోధుమపిండి పంపిణీ చేయాలని పౌరసరఫరాల ఉప తహసీల్దారు ఆర్. సాయికృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమైన ఆయన రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలోగా సరుకుల పంపిణీ పూర్తి చేయాలన్నారు.

నగర సంకీర్తన

బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో నగర సంకీర్తన, భజన కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార సమితి, సమరసతా సేవా ఫౌండేషన్, బొబ్బిలి డివిజన్ ధర్మ ప్రచారకులు ధూపం వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భగవంతుడిని స్తుతిస్తూ గీతాలాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రచారక్ నరసింగరావు, రామినాయుడు, లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు సారధి విద్యార్థులు



జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ లక్ష్మి

రాజాం: స్థానిక పట్టణ పరిధిలోని సారధి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పలువురు జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జీసీఎస్ఆర్ కళాశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు తమ సత్తా చాటారు. ఎం.హేమలత 400 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానం, 300 వేల మీటర్ల వాకింగ్ పోటీల్లో డి.పూర్ణ తృతీయ స్థానం, షార్ట్‌పుట్ విభాగంలో సీనియర్స్ విభాగంలో అండర్–17లో టి.హేమలత ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగంలో టి.దుర్గ ప్రథమ స్థానం, డిస్కస్ త్రో సీనియర్స్ విభాగంలో టి.హేమలత ద్వితీయ స్థానంలో నిలబడగా, టెన్నికాయిట్‌లో ఎం.హేమలత, కె.మౌనిక జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలవగా, సీనియర్స్ టెన్నికాయిట్‌లో ఎం.గోపిక, జి.గాయత్రి ప్రథమ స్థానంలో నిలిచి, సత్తా చాటారని పీడీ మండ లక్ష్మి తెలిపారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం బి.మాధురి అభినందించారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం



రాజాం: నిమజ్జనానికి విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని ముద్దాడ జోగివలస గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం గణనాథుని విగ్రహ ఊరేగింపు చేపట్టారు. రాత్రి సమీపంలోని నదీ తీర ప్రాంతానికి విగ్రహాన్ని తీసుకువెళ్లి, నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో వినాయక మండపంలో వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

వంగర: బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీవో హనుమంతు శశిభూషణరావు సూచించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన రికార్డులు తనిఖీ చేసి, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. సచివాలయానికి వస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులను గౌరవించాలన్నారు. ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సమయపాలన పాటించాలని, తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు.

కళ్లద్దాల పంపిణీ

బొబ్బిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని పిరిడి గ్రామానికి చెందిన పలువురికి కళ్లద్దాలు మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద నేత్ర వైద్య తనిఖీలు చేసిన వారిలో అవసరమైన వారికి వీటిని అందజేశామని ఎంపీడీవో పోతుల రవికుమార్ తెలిపారు.

తీర్మానాలు లేకుండానే రుణాలు

రాజాం సిటీ: డ్వాక్రా గ్రూపులకు సంబంధించి, రుణ లావాదేవీలు తీర్మానాలు లేకుండానే జరుగుతున్నట్లు గుర్తించామని మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో విశ్వబ్రాహ్మణ, భవానీ, పొదుపులక్ష్మి గ్రూపులను తనిఖీ చేశామన్నారు. ఏ గ్రూపులోనూ తీర్మానాలు లేవని, సభ్యుల ప్రమేయం లేకుండా గ్రామ సంఘం ఖాతాల నుంచి రుణం మంజూరు చేసినట్లు తేలిందన్నారు.

శరవేగంగా సీసీ కాలువల నిర్మాణం



వన్నలిలో నిర్మిస్తున్న సీసీ కాలువను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మంగళవారం ఈ పనులను పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్ నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు మంజూరైన రూ.20 లక్షల నిధులతో అవసరమైన చోట రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గార రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ

రాజాం: సకాలంలో ఇంటి పన్ను, నాలా పన్ను చెల్లించాలని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు ప్రజలకు సూచించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని మాధవబజార్, శ్రీనివాసనగర్, వాసవీనగర్, బాబానగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పన్నులు వసూలు చేశారు. ఏడాదికి రెండు పర్యాయాలు పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ప్రజలకు వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఈ నెలాఖరులోగా ఆరు నెలల పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ ఉంటుందన్నారు. అర్థ వార్షిక పన్నులు చెల్లించకపోతే ఏడాదికి వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అలరించిన నృత్య ప్రదర్శన

సంతకవిటి: దుర్గాదేవి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని మందరాడ, కాకరాపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సాయంత్రం విగ్రహంతో తిరువీధి చేపట్టారు. ఆయా గ్రామాలకు చెందిన దేవ్వళ్ల కుటుంబీకులు ఏటా 21 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించి, తిరువీధితో పూర్తి చేస్తారు.



